క్లుప్తంగా

కాంగ్రెస్ ఓబీసీ రాష్ట్ర కన్వీనర్‌గా సునీతాసంపత్



తాండూరు:తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునీతాసంపత్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబీసీ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం పీసీసీ ఓబీసీ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. సునీతాసంపత్ గతంలో కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా, తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు.

వైభవంగా పార్వతీపరమేశ్వరుల పెళ్లి



పార్వతీపరమేశ్వరుల కల్యాణం

బొంరాస్‌పేట: పార్వతీపరమేశ్వరుల పెళ్లి కనుల పండువగా జరిగింది. ప్రతియేటా మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో గుట్టపై వెలసిన ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. శనివారం అభిషేకం, హోమం, కల్యాణ మహోత్సవం శోభాయమానంగా సాగింది. సాయంత్రం పల్లకీ సేవ, పెరుగుబసంతం, రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం అభిషేకం, వీడ్కోలు సభ ఉంటాయని నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో పూజారి శాంతకుమార్, నిర్వహణ కమిటీ సభ్యులు శ్రీనివాస్, నర్సింలు, దేవుసింగ్ తదితరులున్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

దౌల్తాబాద్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎస్‌ఐ శ్రీశైలంయాదవ్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని చంద్రకల్ గ్రామంలో ఉన్న చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానిత వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. రూ.50వేల కంటే ఎక్కువ నగదును వెంట తీసుకెళ్తే తప్పనిసరిగా ఆధారాలు చూపించాలని సూచించారు. ఆధారాలు లేని నగదును సీజ్ చేస్తామన్నారు. అక్రమంగా మద్యం రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వందల ఏళ్ల నాటి ఊడల మర్రి!



బంట్వారం: వందల ఏళ్ల నాటి ఊడల మర్రి బంట్వారం శివారులో చరిత్రాత్మకంగా నిలిచిపోయింది. ఊడల మర్రిలోనే బీరప్ప దేవుడు ఉన్నాడని గ్రామస్తులు ప్రతి ఐదేళ్లకోసారి జాతర నిర్వహిస్తారు. దాదాపు ఎకరానికి పైగా వ్యవసాయ భూమిలో ఎక్కడికక్కడ మర్రి ఊడలు పాతుకుపోయి విస్తరించింది. బీరప్ప మర్రి చెట్టు వందల సంవత్సరాల నాటిదని గ్రామస్తులు అంటున్నారు. మర్రిచెట్టు చాలా కాలం నాటిది కావడంతో అక్కడక్కడ పడిపోతూనే, కొత్తగా ఊడలు భూమిలోకి దిగి మళ్లీ విస్తరిస్తూనే ఉంది. గ్రామస్తులు బీరప్ప మర్రిచెట్టుగా పిలుస్తుంటారు.

పాఠశాలల అభివృద్ధి బాధ్యత కమిటీలదే



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

పరిగి: సర్కారు బడుల అభివృద్ధి బాధ్యత 'అమ్మ ఆదర్శ కమిటీ'లదేనని పరిగి మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. శనివారం పరిగి మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాఠశాలలకు మంజూరైన నిధులతో అత్యవసరమైన అభివృద్ధి పనులు నిర్వహించాలన్నారు. పనుల నిర్వహణలో జాప్యం జరగకుండా వేగవంతంగా నిర్వహించాలని సూచించారు. పాఠశాలలలో జరిగే అభివృద్ధి పనుల పూర్తి బాధ్యత అమ్మ ఆదర్శ పాఠశాలలదేనని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల చైర్‌పర్సన్ తులసి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మొదలైన సాగు కష్టాలు



అంతారంలో ఎండుతున్న వరిపంట

- అడుగంటిన భూగర్భ జలాలు
- గింజదశలో ఎండుముఖం పడుతున్న వరిపంట

దౌల్తాబాద్: ఎండలు మండుతున్నాయి.. వానాకాలం పంట సాగుకు తీసిపోని విధంగా యాసంగిలోనూ సాగు పెరిగింది. అందులోఎక్కువగా నీటి ఆధారిత పంటలు సాగు చేయడం.. ఎండలకు రోజురోజుకూ భూగర్భజలాలు అడుటుతున్నాయి. బోర్ల నుంచి నీరు రాకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలయింది. మండలంలోని పలు గ్రామాల్లో వరిపంట ఎండుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం యాసంగిలో మొత్తం సుమారు 15వేల పైగా ఎకరాల్లో వరిపంటను బోర్ల కింద, చెరువుల కింద సాగుచేశారు. 50 శాతానికి పైగా వరిపంట బోర్లపైనే ఆధారపడి సాగవుతుంది. రోజురోజుకు నీటిమట్టం తగ్గిపోతూ ఉండడంతో ప్రస్తుతం చాలా చోట్ల వరికంకి తొడిగి గింజ పాలు పోసుకుంటున్న సమయంలో నీరందక పంటలు ఎండి పోతుండడంపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజులు ఎండలు మరింత ముదిరే అవకాశాలు ఉండడంతో వరిపంటపై తీవ్ర ప్రభావం పడవచ్చు. రైతుల ఆరుగాలం కష్టపడి సాగునీటి రూపంలో ఆవిరవుతోంది. పంటలు నీరు అందక కళ్ల ముందే ఎండిపోతుంటే రైతులు దిగాలుగా దిక్కులు చూస్తున్నారు. పంటలను కాపాడుకోవాలనే ప్రయత్నంలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. అడుగంటు తున్న భూగర్భజలాలతో ఓ వైపు బోర్లు ఎండిపోవడంతో వేసిన పంటలు చివరి దశలో చేతికి అందకుండా పెట్టుబడులు మీదపడే పరిస్థితుల్లో రైతులు తల్లడిల్లుతున్నారు.

ఉష్ణోగ్రత పెరుగుదలతో...

ప్రస్తుత పరిస్థితుల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా మూడు నుంచి నాలుగు డిగ్రీలు ఎక్కువ నమోదవుతున్నాయి. దీంతో బోరుబావుల్లో నీరు అడుగంటి పోతుంది. మండలంలో చాలా గ్రామాల్లో బోర్లపై ఆధారపడి వేసిన వరిపంటలు చేతికి అందే పరిస్థితిలేదు.

నీటిమట్టం తగ్గింది



బోర్లలో నీటి మట్టం తగ్గింది. వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు కళ్లముందే ఎండిపోతున్నాయి. నాలాంటి రైతులు ఎంతో మంది ఎండుతున్న పంటలను చూసి గుండెలు బాదుకుంటున్నారు. మారిన వాతావరణ పరిస్థితులతో భూగర్భజలాలు అడుగంటి సాగునీరు అందకుండా పోయింది.

– బసయ్యగౌడ్, రైతు, దౌల్తాబాద్

తాగునీటి ఎద్దడికి చర్యలు



సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ మురళీధర్

కుల్కచర్ల: తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని కుల్కచర్ల తహసీల్దార్ మురళీధర్ అన్నారు. శనివారం కుల్కచర్ల మండల కేంద్రంలోని పలు కాలనీల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా భూగర్భజలాలు తగ్గిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా పంచాయతీ సిబ్బంది, అధికారులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా ప్రజలకు సైతం సూచనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడైనా తాగునీటి ఎద్దడి తలెత్తిన సందర్భంలో ఆ సమస్యను అధికారుల దృష్టికి తీసుకవెళ్లాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బలహీనవర్గాలను ఆదుకుంటాం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాజేశ్వరమ్మ

కుల్కచర్ల: నిరుపేదలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని కేఎస్‌ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ అన్నారు. శనివారం కుల్కచర్ల గ్రామానికి చెందిన సాలేటి నర్సమ్మ అనారోగ్య సమస్యతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కేఎస్‌ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజకీయాలకు, కుల,మతాలకు అతీతంగా తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని ఆమె పేర్కొన్నారు. నిరుపేదలకు సదా అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు లక్ష్మణ్, వెంకటయ్య, మణికంఠ, నర్సింలు, తిరుపతి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలి

పాఠశాల కన్వీనర్ రమేశ్



పాఠశాలలో సమావేశమైన కమిటీ సభ్యులు

మోమిన్‌పేట: మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని పాఠశాల కన్వీనర్, ప్రధానోపాధ్యాయుడు రమేశ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని చంద్రాయన్‌పల్లిలో 'అమ్మ ఆదర్శ పాఠశాల' కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజుల్లో పాఠశాలకు వేసవి సెలవులు రానుండటంతో పాఠశాల పరిశుభ్రతను కమిటీ సభ్యులు పర్యవేక్షించాలన్నారు. ముఖ్యంగా చెట్లు, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా చేయాలని ఆయన పేర్కొన్నారు. పాఠశాలలో చేయాల్సిన చిన్న చిన్న పనులను కమిటీ చైర్మన్ లక్ష్మికి తీర్మానం చేస్తూ అప్పగించారు. మరుగుదొడ్లను కమిటీ సభ్యులు పరిశీలించారు. తిరిగి జూన్‌లో పాఠశాల ప్రారంభానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి నాగయ్య, కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసిండు

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



బీఆర్‌ఎస్ నేత సుదర్శన్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పులకుప్పలా చేసిండని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి దుయ్యబట్టారు. శనివారం మండలంలోని నారాయణపూర్ ,వీర్‌శెట్టిపల్లి, గోనూర్, చెన్‌గేస్‌పూర్, ఎల్మకన్నె, ఓగిపూర్, చంద్రవంచ, చిట్టిఘనాపూర్, బెల్కటూర్, చింతమణిపట్నం, పర్వాతపూర్, చెంగోల్, గౌతపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నన్ను ఆదరించి గెలిపించిన తాండూరు ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. నాయకుడిగా కాకుండా సేవాకుడిగా పని చేస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మూడు నెలలు మాత్రమే అవుతుందన్నారు. ఎన్నికల తర్వాత సంక్షేమ పథకాలు పరుగులు పెట్టిస్తామన్నారు. మన జిల్లాకు చెందిన సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో తాండూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. తాండూరు నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు అయ్యాయని.. ఎన్నికలు ముగిసిన తర్వాత లబ్ధిదారులను ఎంపిక చేస్తామని చెప్పారు. మార్చి నుంచి కరెంట్ బిల్లులు కట్టొద్దని.. ఒకవేళ విద్యుత్ అధికారులు కరెంట్ బిల్లులు కట్టాలని ఒత్తిడి చేస్తే సంబంధిత అధికారులను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. వృద్ధులకు త్వరలో రూ.4 వేల పెన్షన్ ఇస్తామని చెప్పారు. జాన్‌ధన్ ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని చెప్పిన బీజేపీ ప్రభుత్వాన్ని నమ్మొద్దని సూచించారు. మే 13న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కోరారు. చంద్రవంచ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు సుదర్శన్‌రెడ్డి 100 మందితో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగప్ప, పెద్దేముల్ జెడ్పీటీసీ ధారాసింగ్,పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, నాయకులు ఉత్తమ్ చందు, జనార్దన్‌రెడ్డి, వడ్డె శ్రీను, ఉప్పరి రాజు, నర్సిములు, నర్సిరెడ్డి, ఉదయ్ భాస్కర్‌రెడ్డి, సత్యానారాయణ, మున్నెప్ప, గౌతం, శ్రీశైలంగౌడ్ ,రాజుగౌడ్, వెంకటేష్, మల్లప్ప, బస్వరాజ్, హర్షవర్ధన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, విజయ్‌కుమార్ ఉన్నారు.

క్రీడలతోనే మానసిక ప్రశాంతత



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

పూడూరు: క్రీడలు మానసిక ప్రశాంతత, శారీరక ధారుడ్యానికి తోడ్పడతాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు టి.రితిక్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మన్నెగూడలో డీసీసీ కార్యదర్శి పెంటయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి తనయుడు సిద్దార్థరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే పోటీతత్వాన్ని అలవర్చుకొని అన్ని రంగాల్లో రాణించాలన్నారు. క్రీడాలు స్నేహ భావంతో ఆడాలని సూచించారు. గెలుపోటములు సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడాకారులకు తన ప్రోత్సాహం ఎల్లప్పుడు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సురేందర్, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆనందం, శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు అజీంపటేల్, శ్రీనివాస్, నాయకులు నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, భాస్కర్, లక్ష్మణ్, నరేష్ పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం



మదన్‌పల్లిలో పైకప్పు ఎగిరిపోయిన ఇల్లు



రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్ల తొలగింపు

బొంరాస్‌పేట: మండలంలో శనివారం సాయంత్రం అకాలవర్షాల కారణంగా బలమైన ఈదురుగాలులు వీచాయి. మండల పరిధిలోని మదన్‌పల్లి, బురాన్‌పూర్, సాలిండాపూర్, ఆయా గిరిజన తండాల్లో భారీ గాలులు వీచాయి. మదన్‌పల్లి, మదన్‌పల్లితండాలో పలు ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. సామగ్రి, తిండిగింజలు తడిచిపోయాయి. రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి. ఆయా గ్రామాలు, తండాల్లో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. అధికారులు పరిశీలించి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దుమ్ములేచి పోతోంది..



కంకర తేలిన తాండూరు రహదారి

- రోడ్డు నిర్మాణంలో జాప్యం
- ఏళ్లు గడుస్తున్నా అసంపూర్తిగానే
- కంకర తేలిన తాండూరు రహదారి

కొడంగల్ : మహబూబ్‌నగర్ – చించోలి జాతీయ రహదారి పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ రహదారిని రెండు బిట్లుగా విభజించి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. మహబూబ్‌నగర్ నుంచి దుద్యాల గేటు వరకు ఒక మోస్తరుగా పనులు జరిగాయి. దుద్యాల నుంచి కొడంగల్, తాండూరు మీదుగా నిర్మిస్తున్న రహదారి పనులు మందకోడిగా సాగుతున్నాయి. ఈ రహదారిపై వెళ్లాలంటే గగనంగా మారింది. భారీ వాహనాలు వెళ్తే దుమ్ములేస్తోంది. ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పలు చోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయి.

జాతీయ రహదారిగా గుర్తింపు

ఈ రోడ్డును కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారిగా మార్చింది. 167 ఎన్ జాతీయ రహదారిగా గుర్తించారు. రోడ్డు విస్తరణ పనుల కోసం తొలిదశగా రూ.704 కోట్లు మంజూరు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కంకర తేలిన రోడ్డుపై రాకపోకలకు ఇబ్బందిగా మారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగినా అధికార యంత్రాంగంలో చలనం లేదని బాధితులు వాపోతున్నారు.

విస్తరణ పనుల్లో జాప్యం

కొడంగల్ మీదుగా తాండూరు నుంచి చించోలి వరకు జాతీయ రహదారిని కేంద్ర ప్రభుత్వం గతంలో మంజూరు చేసింది. బెంగుళూరు ముంబాయి జాతీయ రహదారులను అనుసంధానం చేసేలా ఈ రహదారిని నిర్మిస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బూత్పూరు నుంచి కొడంగల్, తాండూరు, చించోలి మీదుగా కర్నాటక రాష్ట్రం మన్నెకెళ్లి వరకు జాతీయ రహదారి ఏర్పాటు చేస్తున్నారు. మన్నెకెళ్లి దగ్గర ముంబాయి జాతీయ రహదారితో కలుస్తుంది. మొత్తం 150 కిలోమీటర్లు పొడవు గల ఈ జాతీయ రహదారి వికారాబాద్ జిల్లాలో 45 కిలోమీటర్లు ఉంది. ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉచిత కోచింగ్

అనంతగిరి: సత్యసాయి సేవా సమితి యువజన విభాగం ఆధ్వర్యంలో వికారాబాద్‌లో పదవ తరగతి చదివి పాలిటెక్నిక్ అప్లై చేసుకున్న విద్యార్థులకు ఈనెల 25వ తేదీ నుంచి మే 20వ తేదీ వరకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని బస్టాండ్ పక్కన సత్యసాయి మందిరంలో శిక్షణ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9959290540, 8328268821లో సంప్రదించాలన్నారు.

బీఆర్‌ఎస్ నేత కృష్ణయ్య సస్పెండ్

అనంతగిరి: పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న వికారాబాద్ నియోజకవర్గంలోని భూమెళ్ల కృష్ణయ్యను బీఆర్‌ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు వికారాబాద్ పట్టణ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

త్వరలో కేసీఆర్‌ను కలుస్తాం–కృష్ణయ్య

బీఆర్‌ఎస్ పార్టీలో ఉద్యమకారుడిగా, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న తనను పార్టీ నుంచి సస్పెండ్ చేసే అధికారం , హోదా బీఆర్‌ఎస్ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డికి లేదని భూమెళ్ల కృష్ణయ్య ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ విషయమై త్వరలో పార్టీ అధినేత కేసీఆర్‌ను కలుస్తానని తెలిపారు.

సమర్థవంతంగా నిర్వహించాలి

అనంతగిరి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో విధులు సమర్థవంతంగా నిర్వహించాలని వికారాబాద్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాహుల్ శర్మ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వికారాబాద్ నియోజకవర్గ పరిధి తహసీల్దార్లు, నోడల్ ఆఫీసర్లు, సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంట్ టీం తదితరులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అధికారులు సమయాత్తం కావాలన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని తదుపరి నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ, అభ్యంతరల స్వీకరణ, తుది జాబితా విడుదల అనంతరం మే 13న పోలింగ్ ఉంటుందని చెప్పారు. ఎన్నికల ఉల్లంఘనకు పాల్పడకుండా సంబంధిత అధికారులు జాగ్రత్త వహించాలని సూచించారు. సీ విజిల్‌లో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి పాల్గొన్నారు.

గ్రామస్తులకు అండగా ఉంటాం



సామగ్రి అందజేస్తున్న శాంతిబాయి

కుల్కచర్ల: గ్రామ ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని పటేల్ చెరువు తండా గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ శాంతిబాయి అన్నారు. శనివారం పోటీగడ్డతండాకు చెందిన లావణ్యపెళ్లికి కానుకగా ఒక క్వింటా సోనాబియ్యం, 15కేజీల మంచి నూనె, 5కిలోల పప్పు, తదితర వంటసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ పరిధిలోని ఆడపడుచల పెళ్లిలందరికీ తమవంతుగా రూ.10వేల విలువ చేసే సామాగ్రి కానుకగా నిరంతరం అందజేసేలా ముందుకు సాగుతున్నామన్నారు. తాను సర్పంచ్‌గా ఉన్న 5సంవత్సరాల్లో ఇవ్వడంతో పాటుగా భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాము, శ్రీనునాయక్, తావుర్య నాయక్, మాణిక్ పవర్, చందర్, గోపాల్, రాజు, హరిశ్చంద్ర, మోహన్, గోపాల్, వెంకట్, సంతోష్, రాజు, పాండు, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

మోదీతోనే దేశ ప్రగతి సాధ్యం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్‌కుమార్



పెద్దేముల్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

పెద్దేముల్: బీజేపీతోనే దేశ ప్రగతి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉప్పరి రమేశ్‌కుమార్ అన్నారు. శనివారం పెద్దేముల్ మండల మారేపల్లి, పెద్దేముల్ గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు హరీశ్‌గౌడ్ ఆధ్వర్యంలో చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. బీజేపీ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తుందన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. 60 ఏళ్ల అధికారంలో ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఏమి చేసిందని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో రెండు పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, అసెంబ్లీ కన్వీనర్ రజినికాంత్ , రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి సాహు శ్రీలత, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు సందీప్‌కుమార్, మండల ఇన్‌చార్జి గాజుల శాంత్‌కుమార్, మండల కార్యవర్గ సభ్యులు రాంచందర్, యాదయ్య గౌడ్, నాయకులు నర్సింహ, ప్రవీణ్ ప్రదీప్, కృష్ణ, రమేశ్, అంజి, రాంరెడ్డి, ఆశోక్, వెంకటేశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధం



వెయిటింగ్ హాల్



సబ్ జైల్



అసంపూర్తిగా ఉన్న మున్సిపల్ కార్యాలయం

కొడంగల్ : కొడంగల్‌లో నిర్మించిన పలు భవనాలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మౌలిక సదుపాయాల సంస్థ ఆధ్వర్యంలో రూ.50 లక్షలతో ప్రభుత్వాసుపత్రి వెయిటింగ్ హాల్‌ను నిర్మించారు. పనులు పూర్తయి ప్రస్తుతం ప్రారంభానికి ఎదురుచూస్తోంది. మూడేళ్ల క్రితం రూ.46 లక్షలతో మరమ్మతులు చేసినా సబ్‌జైల్‌ను ఇప్పటి వరకు ప్రారంభించలేదు. రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్న మున్సిపల్ కార్యాలయం పనుల్లో జాప్యం జరుగుతోంది. పనులు పూర్తి కాకపోవడంతో ప్రస్తుతం ఉన్న మున్సిపల్ కార్యాలయంలో స్థలం సరిపోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.